# ముద్దబంతి నవ్వులో



రాంబాబు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పక చూస్తుండిపోయారు ఆ గదిలోని బాలికలు.

"రెండు పరమాణువులు ఎందుకు సంయోగం చెందుతాయి?" రాంబాబు మళ్లీ ప్రశ్నించాడు.

ఊహు! అసలు వారికి ఆ ప్రశ్న వినిపిస్తే కదా! పాలమీగడతో తేనె రంగరించి అందులో పరిపూర్ణ పురుషత్వాన్ని, పున్నమి నాగు బుసలసెగలని కలిపి తీర్చిదిద్దిన రాకుమారుడిలా, చామంతి రంగుదేహచ్ఛాయతో షర్టు పై గుండీలోంచి తొంగి చూస్తున్న రోమాల దొంతర వెక్కిరిస్తుంటే - ముట్టుకుంటే కందిపోయే చెక్కిళ్లతో రక్తం చిమ్ముతున్న ఎర్రని పెదవులమీద లేలేత నూనూగుమీసంతో తన వృత్తిలో లీనమై అంకిత భావంతో పాఠం మొదలెట్టిన అతనిని అలాగే చూస్తుండి పోయారు.

"అదేమిటమ్మా! నా మొహాన ఏమైనా కోతులాడుతున్నాయా? నా ప్రశ్నకు ఒక్కరూ జవాబు చెప్పరేం? తెలియకపోతే కనీసం తెలీదు అనైనా సమాధానం చెప్పవచ్చు కదా!" అన్నాడు రాంబాబు.

"లెగవే! లే! నువ్వు చెప్పు" అంటూ నలుగురైదుగురు ఓ పుష్కలేశ్వరిని ముందుకు తోయడంతో ఆమె సిగ్గుపడుతూ లేవలేక లేచి నిలబడింది.

"నిజంగా తెలియదు సార్!" సిగ్గు దొంతరలతో పీలగా అనేసి కూర్చోబోతుంటే రాంబాబు అన్నాడు.

"ఆఁ! ఆగాగు! కూర్చోకు. నువ్వు నచ్చావమ్మాయి! ఇంతమందిలో ధైర్యంగా 'తెలీదు' అని చెప్పడానికయినా లేచావ్! ఇంతకీ నీ పేరు?"

"కామాక్షి సార్!" చెప్పిందా అమ్మాయి.

"వెరీగుడ్! యీ స్కూలులో ఎన్నేళ్లనుంచి చదువుతున్నావ్?"

"ఎనిమిదో తరగతి నుండి!"

"మరి తొమ్మిదో తరగతి రసాయన శాస్త్రంలోనే మీకు పరమాణు నిర్మాణం, రసాయనబంధం గురించి తెలిసివుండాలే" అని అడిగాడు రాంబాబు.

"మాకు రెండేళ్ళనుంచీ సైన్సు మాష్టారులేరు సార్! అందుకేగా మిమ్మల్ని వేశారు." అందెవరో అమ్మాయి.

రాంబాబు చటుక్కున నాలిక కరుచుకున్నాడు.

"సరే! అయితే .నా శక్తిమేరకు మీకు అర్థం అయ్యేలా చెప్పడానికి ప్రయత్నిస్తాను. ఈ ప్రపంచంలో ప్రతీపదార్థం పరమాణునిర్మితం. మనశరీరంలో రక్తకణాల మాదిరిగా! అయితే మనవి జీవకణాలు.

పదార్థం పరమాణువులతో ఏర్పడు తుంది. పరమాణువులుగా వున్నపుడు వాటికి ఎక్కువశక్తి వుంటుంది. ఎక్కువగా ఉన్నశక్తిని తగ్గించుకుని స్థిరత్వం పొందడం కోసం ఒక పరమాణువు మరొక పరమాణువుతో సంయోగం చెందుతుంది. అర్థం అయిందా?"

వాళ్లు అవే దిష్టిమొహలు చూడసాగారు తెల్లమొగం వేసుకుని. "సరే! దీనిని నిత్యజీవితానికి అన్వయించి చెప్పుకుందాం" రాంబాబు కంటిన్యూ చేశాడు.

"మీ ఇంట్లో మీ అన్నయ్య ఏదైనా ఉద్యోగం చేస్తున్నాడనుకుందాం. అతనికి ఇంకా పెళ్లికాలేదనుకోండి. చేతుల్లో ఉన్న డబ్బులతో ఫ్రెండ్స్ అందరితో తిరిగితిరిగి ఏ అర్ధరాత్రికో ఇంటికి చేరుకుంటున్నాడను కోండి. అపుడు మీ అమ్మగారు మీ నాన్న గార్కి, ఓ సలహా యిచ్చారనుకుందాం. 'ఒక్కడేకదా అని ఇష్టం వచ్చినట్లు గాలి తిరుగుళ్లు తిరుగుతున్నాడండీ! వీడి మెడకో గుదిబండని తగిలిస్తేగాని దారిలోకిరాడు అని' అప్పుడు మీ నాన్నగారు వాడికో సంబంధం చూసి అంటే మరో పరమాణువు లాంటి కోడలినిచూసి కట్టబెడతారను కుందాం. రోజూ అర్ధరాత్రిగాని ఇంటికిరాని మీ అన్నగారు సాయంత్రం ఆరుగంటలకే వివాహమయ్యాక పువ్వులతో తయారై పోతాడు. అంటే పరమాణువుగా వుండగా ఎక్కువశక్తితో తిరిగినవాడు తన శక్తిని తగ్గించుకుని స్థిరత్వం పొందడంకోసం మరో పరమాణువైన తన భార్యతో సంయోగం చెంది బంధం ఏర్పరచుకుంటాడన్న మాట!"

అతను చెప్పటం పూర్తిచేయకముందే చప్పట్లతో ఆ గదంతా మార్మోగిపోయింది. కామాక్షి లేచి నిలబడింది.

"చాలా థాంక్స్ సార్! బాగా అర్థ మయ్యేలా చెప్పారు సార్. ఇంత బాగా సైన్సు పాఠం చెప్పిన మాస్టారిని నేను ఇంతవరకు చూడలేదుసార్! మీరు రోజూ ఇలాగే పాఠాలు చెప్పాలి సార్ థాంక్యూ సర్!"

అంతలో గణగణమని బెల్ మోగడంతో బయటకు వెళ్లబోతూ అన్నాడు రాంబాబు

"చూడండమ్మా! మీ అందరికీ పాఠం అర్థం అయ్యేలా చెప్పడం నా బాధ్యత. దానిని సద్వినియోగం చేసుకుని మీరందరూ కష్టపడి చదువుకుంటేనే నేను చెప్పిన యీ విద్యకు అర్థం. ఇపుడే కాదు. ఏ విషయంలోనైనా మీకు సందేహం వస్తే మా ఇంటికి వచ్చి అడిగినా మీ సందేహం తీర్చేపూచీ నాది... సరేనా!"

"సార్ మీ ఇల్లెక్కడ?" ఓ అమ్మాయి అడిగింది.

"మా ఇంటి ప్రక్క డాబామీద వాటాలోకి నిన్న సాయంత్రమే వచ్చారే!" రాంబాబు స్టాఫ్‌రూమ్‌లోకి వెళ్లడంతో కామాక్షి మాటలు అతనికి వినపడనే లేదు.

★★★

"ఏమండీ! మీ కోసం ఎవరో వచ్చారు?" చాతుర్య అన్న మాటలకు టీచింగ్ నోట్సు రాసుకుంటున్న రాంబాబు లేచి బయటకు వచ్చాడు.

ఎదురుగా ఓ నడివయసావిడ!

"చెప్పండమ్మా! ఎవరు మీరు? ఏం కావాలి?"

సమాధానంగా ఆమె వెనుక నుంచి ప్రసిద్ధ దర్శకుని చిత్రంలో హీరోయిన్ ఎంట్రన్స్‌లా, కారుమబ్బు తొలగిన చంద్రునిలా, ముగ్ధమనోహరంగా చక్రాల్లాంటి కళ్లతో ప్రక్కకు వచ్చి తలవంచుకు నిలబడింది కామాక్షి!

మంచి మందులతో ఏపుగా పెరిగిన మొక్కజొన్న కండెలా, నిగనిగలాడుతున్న అల్ల నేరేడు పండులా, చక్కగా తంపటవేసిన లావు తేగలా, ఒకగేదె ఒబ్బిడిగా వేసిన పేడకడిలా నిండుగా పుష్టిగా ఉన్న కామాక్షిని చూస్తూనే తెల్లబోయాడు రాంబాబు.

పాఠశాలలో యూనిఫాంలో కనిపించిన ఆ కామాక్షికి, ముద్దబంతి పువ్వులా, ముద్దమందారంలా చక్కని అవయవ పొందికతో, వయసు బింకంతో, రక్తపు బిగితో పంట ఏపుగా ఎదిగి కోతకు వచ్చిన పచ్చని పైరులా పరికిణీతో, ఓణీతో ఉన్న ఈ కామాక్షికి అసలు పోలికేలేదు. బలవంతంగా ఆమె మీదనుంచి చూపు తిప్పుకుంటూ అడిగాడు రాంబాబు!

"చెప్పండమ్మా! ఏం కావాలి? నాతో ఏమైనా పని వుందా?"

"అవును బాబుగారూ! మీరు ఈ ఏల ఏదో పాటం సెప్పారంట. దానికి శానా బాగా అర్థం అయిందంట. ఇల్లు పక్కనే కదా. అంతమందిలో సెప్పించుకునే దానికన్నా మీరు ఇక్కడ దానికి ప్రైవేట్ సెబితే మీకు ఎంత డబ్బు కావాలంటే అంత ఇత్తాను. దానికి ఓ అచ్చరం అబ్బితే మాకు ఆనందం బాబు. మీ పున్నెం వూరికేపోదు" అందామె.

"చూడండమ్మా! నేను ఎవరికీ ట్యూషన్లు చెప్పను. ప్రభుత్వంవారు మాకిచ్చే జీతం నాకు, నా భార్యకు సరిపోతుంది. పైగా మేం బాగా ఆస్తిపరులం. పదిమందికి విజ్ఞానం పంచియిచ్చే యీ ఉపాధ్యాయవృత్తి అంటే నాకు ప్రాణం. ఇకపోతే తనకు ఏమైనా సందేహాలు వుంటే పంపండి తీరుస్తాను. అంతేగాని ప్రైవేట్ అని పేరుపెట్టి డబ్బు తీసుకుని చదువు చెప్పే పద్ధతి నాకు నచ్చదు. ఏమీ అనుకోకండి!" అన్నాడు.

"యిన్నావుగా ఆ బాబుగారి మంచి మాటలు. నీకేమైనా సందేహాలుంటే ఆయన్ను అడుగు!" అంది కామాక్షి వాళ్ల అమ్మ.

"సార్! నాకు పరమాణు నిర్మాణం, రసాయనబంధం పూర్తిగా అర్థమయ్యేలా చెప్పరా?"

"రేపు క్లాసులో చెబుతానుగా!"

"అదికాదుసార్! ఇక్కడ ఒకసారి విని, అక్కడకూడా వింటే బాగా అర్థం అవుతుంది కదా అని!"

"సరే! ఇంటికి వెళ్లి పుస్తకాలు తెచ్చుకో!" అన్నాడు రాంబాబు.

ఆమె సమాధానంగా తన చేతుల్లోని పుస్తకాలు రాంబాబు ముందుకు చాచింది.

"ఓ! రెడీగానే వచ్చావన్నమాట అమ్మా! మరో గంటలో మీరు వచ్చినా సరే లేదా పాఠం పూర్తయ్యాక నేను వచ్చి దిగబెడతాను" అన్నాడు రాంబాబు.

కామాక్షి వాళ్ళ అమ్మ చేతులు జోడించి "గంట తర్వాత వత్తాను! బాగా యిని ఒంట పట్టించుకో! నీదనలే మొద్దుబుర్ర. యింటికొచ్చి మళ్లీ నా పానం తీత్తావు. వత్తాను బాబూ!" ఆమె వెళ్లిపోయింది.

"లోపలకు రా!" రాంబాబు తన డైనింగ్ రూమ్‌లోకి నడిచాడు. స్వప్న మందిరంలోకి అడుగుపెడుతున్నంత అపురూపంగా లోపలకు అడుగుపెట్టింది కామాక్షి.

"చూడు! అమ్మగార్కి ఒంట్లో బాగా లేదు. టాబ్లెట్, వేసి కాఫీ యిచ్చి వస్తాను. ఇంతలో నీకు ఎక్కడ డౌటో చూసుకుంటూ వుండు!"

అతనలా వెళ్లినవెంటనే కామాక్షి జాకెట్‌కు స్టెప్స్ పెట్టుకున్న పిన్నీసు తీసేసింది. ఓణీ ఒంటిపొరన లోపలినుంచి వక్షపు ఆచ్ఛాదనలన్నీ స్వచ్ఛంగా కన్పించేలా వేసుకుంది. ఓణీ క్రిందనుంచి చెయిపోనిచ్చి జాకెట్‌పై హుక్కు, అడుగునవున్న హుక్కు తీసేసింది. జాకెట్ అడుగుభాగం కొసలుపట్టి క్రిందకు బలంగా సర్దుకుంది. 'మిమ్మల్ని నాలో దాచడం నావల్ల కాదు' అన్నట్టుగా జాకెట్ కక్కేసినట్టుగా బయటకు తొంగిచూస్తున్న యవ్వనమదచిహ్నాలు స్పష్టంగా కనపడేలా సర్దుకుని ఏమీ ఎరగనట్లుగా బాసింపట్టం వేసుకుని నేలమీదకూర్చుని పుస్తకం తెరచింది.

రాంబాబు వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. కామాక్షి పుస్తకం ఇచ్చింది అమాయకంగా.

సరిగ్గా అపుడుచూశాడు ఆమెను. ఆకలిగొన్న పులికి ఎదురుగా జింకపిల్ల కన్పించినట్టుగా, అన్నార్తుడి ముందు పంచభక్ష్య పరమాన్నంలా, నడిసంద్రంలో వున్న అభాగ్యుడికి చుక్కానిలా తోచిందామె అతని కళ్లకు.

అతడు కుర్చీని ఆమెకు దగ్గర లాక్కుని "చదువుకోవడానికి వచ్చినపుడు ఒబ్బిడిగా కూర్చోవాలి!" అన్నాడు.

ఆమె అప్పుడే గ్రహించినదానిలా - మొత్తం పమిటనంతా ఉంగలా చుట్టి వేసుకుని "చెప్పండి సార్!" అంది.

ఇపుడు ఆమె పలుచనిపొట్ట, లోతైననాభి, వక్షంలో సగభాగం ఎటువంటి ఆచ్ఛాదన లేకుండా కన్పిస్తున్నాయి. మళ్లీ ఏదైనా అంటే మళ్లీ సర్దుకుంటుందేమో అనే భయంతో రాంబాబు పాఠం మొదలుపెట్టాడు.

"ప్రతీ పదార్థం పరమాణు నిర్మితం అని చెప్పాను కదా! పరమాణువులో మూడుమౌలిక కణాలుంటాయి ముఖ్యంగా. వాటిని ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అంటారు. మన నిత్యజీవితంలో తండ్రిలేని కుటుంబాన్ని తీసుకుందాం. ప్రోటాన్ అంటే కొడుకు అన్నమాట. న్యూట్రాన్ అంటే తల్లి. ఎలక్ట్రాన్ అంటే కోడలు. పరమాణు నమూనా ప్రకారం ప్రోటాను ధనావేశం, ఎలక్ట్రాను ఋణావేశం కలిగుంటుంది.

ఆవేశాలలో ప్రోటాను, ఎలక్ట్రానులు సమాన విలువలు కలిగివుండి పరస్పరం వ్యతిరేక ఆవేశాలను కలిగివుంటాయన్న మాట. అంటే ఒక కుటుంబంలో భర్తకు, భార్యకు అన్ని విషయాలలోనూ సమాన హక్కులున్నట్టుగా.

ఇకపోతే పరమాణువు మధ్యలో దాని భారమంతా కేంద్రీకృతమై వుంటుంది. పరమాణు కేంద్రకంలో ధనావేశంగల ప్రోటాను, ఏ ఆవేశం లేని న్యూట్రానులు వుంటాయి అంటే తల్లీ కొడుకులు

కేంద్రభాగంగా వున్న కుటుంబంలా. ఋణావేశం గల ఎలక్ట్రాను కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తూ వుంటుంది. అంటే కోడలు వారి మీదనే ఆధారపడి జీవిస్తుంటుందన్న మాట. ఏమైనా అర్థం అయిందా?" అని అడిగాడు రాంబాబు.

అతని పాదాల దగ్గర కూర్చుని అతను చెప్పేది శ్రద్ధగా వింటూ అపుడపుడు సిగ్గుపడుతూ తలవంచుకుని లుంగీకొసలు తొలగిన అతని కాళ్ళపై కోడెవయసు రోమాలను పరిశీలిస్తున్న కామాక్షి వెంటనే అడిగింది.

"సార్! ఆవేశం అంటే?"

రాంబాబు ఒక్కక్షణం తడబడి పోయాడు. తమాయించుకుని అన్నాడు. "ఆవేశం అంటే విద్యుదావేశం"

"అర్థం కాలేదు సార్!" అన్నది కామాక్షి.

"చూడు! ఉదాహరణకి నువు ఒక సీరియస్ ఫైటింగ్‌సీను సినిమాలో చూస్తున్నావనుకో! నీకు కూడా ఉత్తేజం వచ్చి ప్రక్క సీటువాళ్ళతో ఫైట్ చేయాలని అనిపించదూ! అలాంటి ఉత్తేజక శక్తి అన్నమాట!"

"నేను ఫైటింగ్ సినిమాలు చూడను సార్! ఒక్క మెగాస్టార్ చిరంజీవి గారివి తప్ప!" అన్నది కామాక్షి.

రాంబాబు ఆమె కేసి సూటిగా చూస్తూ చిరునవ్వుతో "జిల్ జిల్ జిల్‌మంటూ మ్రోగింది ఎద లోయల్లో కాంభోజిరాగం..." ఆ పాట నాకు పూర్తిగారాదు గాని ఆ పాటలో సౌందర్య ఎంతో సంతోషంతో డాన్స్ చేసింది కదా అది చూసినపుడు నీకు ఏమనిపిస్తుంది?" అడిగాడు.

"నాకూ అలా చెట్లు చేమలు, వాగులు, వంకలు తిరుగుతూ డాన్స్ చెయ్యాలనిపిస్తుంది!"

"ఎస్! ఆ ఉత్తేజిత శక్తినే విద్యుదావేశం అనవచ్చు!"

"మరి రెండు పరమాణువుల మధ్య బంధం ఎపుడు ఎలా ఏర్పడుతుంది సార్?" అడిగింది కామాక్షి.

"గుడ్ క్వశ్చన్! రెండు పరమాణువుల మధ్య బంధం రెండురకాలుగా ఏర్పడుతుంది ప్రధానంగా!

ఒకటి అయానిక బంధం; రెండోది సమయోజనీయ బంధం. అయానిక బంధం రెండు పరమాణువుల మధ్య ఎలక్ట్రానుల బదలాయింపువల్ల ఏర్పడుతుంది. అంటే రేపు నీకు పెళ్లయిందనుకో! మీ కుటుంబంలోంచి ఎలక్ట్రాను అయిన నువ్వు మరో కుటుంబంలోకి పర్మనెంటుగా వెళ్ళిపోతున్నావన్నమాట. అందువల్ల మీ రెండు కుటుంబాల మధ్య పర్మనెంటు బంధం ఏర్పడుతుంది. ఆ బంధాన్ని అయానిక బంధం అనచ్చు.

అదే రెండు పరమాణువులు ఒక ఎలక్ట్రాను జతను సమిష్టిగా పంచుకోవడంవల్ల సమయోజనీయబంధం ఏర్పడుతుంది అంటే పిల్లల తాలూకూ బాధ్యతలని భార్యభర్తలు పంచుకుంటారు చూడు! అలాగ!"

"అంటే ఒక మగ, ఆడ కష్ట సుఖాలను సమానంగా పంచుకునేలాగానా సార్!" 'సుఖాలను' అన్న పదం దగ్గర ఒత్తి పలుకుతూ! అంది కామాక్షి.

"అవును! బాగానే అర్థం చేసుకున్నావు!"

"మరి ఏక బంధం; ద్విబంధం; త్రిబంధాలు ఎలా ఏర్పడతాయి సార్?" అని అడిగింది.

"రెండు పరమాణువుల మధ్య ఒక ఎలక్ట్రాను జంట పంచుకోబడితే ఏక బంధం; రెండు ఎలక్ట్రాను జంటలు పంచుకోబడితే ద్విబంధం; మూడు ఎలక్ట్రాను జంటలు పంచుకోబడితే త్రిబంధం ఏర్పడతాయి" చెప్పాడు రాంబాబు.

"అంటే మా అమ్మా,నాన్నలకు పెద్దఅన్నయ్య పుట్టినపుడు ఏకబంధం, రెండవ అన్నయ్య పుట్టినపుడు ద్విబంధం, నేను పుట్టినపుడు త్రిబంధం ఏర్పడిందన్నమాట. మాది త్రిబంధం కుటుంబం కదా సార్!" అన్నది కామాక్షి.

"సబ్జక్టుపట్ల ఇంత అవగాహనవున్న దానివి మరి నీకింక వేరే ట్యూషన్ ఎందుకు?" అని నవ్వుతూ అడిగాడు రాంబాబు.

"అవగాహన ఉన్నంతగా 'అనుభవం' లేదు సార్! అనుభవమైతే అది ఆజన్మాంతం గుర్తుంటుంది కదా! మీకు... మీకు అభ్యంతరం లేకపోతే అయానిక బంధంలా మీ ఇంట్లో ప్రవేశించి, సమయోజనీయ బంధంలా మిమ్మల్ని పంచుకుని కనీసం త్రిబంధం వరకూ ఏర్పరచుకోవాలని ఆశగా వుంది సార్! ఏమంటారు?" జారిపోయిన పమిటను ఏమాత్రం పట్టించుకోకుండా మత్తుగా సిల్కుస్మిత చూపులు చూస్తూ అంటున్న ఆమె మాటలకు రాంబాబు ఒక్కసారిగా నిరుత్తరుడైపోయాడు.

"సార్! నా జీవితంలో ఎంతోమంది మాస్టర్లు పాఠం చెప్పగా విన్నాను. అస్సలు అర్థంకాని, కంటితో చూడని పాఠాలని జీవితానికి అన్వయించి చెప్పిన మీలాంటి వారిని నేను ఎక్కడా చూడలేదు. అంతే కాదు! ఇంత అందమైన పర్సనాలిటీని ఇంత దగ్గరగా కూర్చుని చూసే అదృష్టం కూడా నాకింతవరకూ దక్కలేదు..." అంటూ అరమూసిన కన్నులతో ఏవేవో పిచ్చిపిచ్చిగా మాట్లాడసాగింది.

రాంబాబుకి నిలువెల్లా చెమట్లు పట్టేశాయి.

అదే సమయంలో భగవత్సాక్షాత్కారమైనట్టుగా "అయిపోయిందాబాబూ!" అంటూ కామాక్షి తల్లి మెట్లెక్కుతూనే అనడంతో వెంటనే పమిట సర్దుకుని పుస్తకాలు తీసుకుని "వస్తాను సార్" అనేసి వెళ్ళిపోయింది కామాక్షి.

రాంబాబు తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు.

★★★

ఆ గదిలో నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు రాంబాబు.

"అమ్మా! ఇరవై సంవత్సరాలు వయసునిండిన అమ్మాయిని కాలక్షేపం పేరుతో పాఠశాలకు పంపిస్తున్నామని మీరు అనుకుంటున్నారేగాని ఆ అమ్మాయి పదవ తరగతి పరీక్ష ఎందుకు తప్పిందో కారణాన్ని అన్వేషించలేకపోయారు. తను నా పాఠంవైపు ఆకర్షితురాలయింది అనుకున్నానేగాని నావైపు ఆకర్షితురాలైందని ఆమె నాకు వ్రాసిన ఉత్తరం చూశాకనే తెలిసింది.

వయసొచ్చిన ఆడపిల్లను కొట్టి కసిదీరాతిట్టి మీ బాధ్యతను కప్పిపుచ్చుకునే కంటే ఇప్పటికైనా మేల్కొని ఆమెకు తగిన వరుడిని ఇచ్చి ఎంత తొందరగా వివాహం చేస్తే అంత మంచిది. మీ అమ్మాయి చెడ్డపిల్లకాదు. అసాధారణ తెలివితేటలు గలది. నేను చెప్పిన పాఠాలు ఎంతోమంది బట్టీలు వేస్తారు అర్థం కాక. అయితే అంత బాగా అర్థం చేసుకుని కూడా దారి తప్పుతోంది.

అంటే టీ.వీ.ల ప్రభావం, సినిమాల ప్రభావం తొంభైశాతం వుండడమే. తనే కాదు, తనలా ఎంతో బాగా చదివే పిల్లలు ఈ వేళ గాడితప్పి తమ జీవితాలను చేజేతులారా తామే పాడుచేసుకుంటున్నారు. పెళ్ళికి ముందే అన్నీ అనుభవించాలనే వెర్రి వ్యామోహంలో వున్నారే తప్ప, సరియైన దాంపత్యజీవితం లభించేనాటికి తామెంత నిర్వీర్యులైపోతున్నారో అర్థం చేసుకోలేకపోతున్నారు.

ఎవరు ఎలాంటి మాటమాట్లాడినా దాన్ని స్త్రీ పురుషసంబంధానికి అన్వయించుకుని అదేదో తెలుసుకోవాలని ఆరాటపడుతున్నారేగాని నిజమయిన విలువలు తెలుసుకోలేకపోతున్నారు. కామాక్షి తన సంసారాన్ని ఎంతోచక్కగా తీర్చి దిద్దుకోగలిగినటువంటి నైపుణ్యం ఉన్న అమ్మాయి అనిపించిందినాకు.

వెంటనే ఆమె అవసరాలను గుర్తించి మీరు ఆమెకు వివాహం చేయడం మంచిది. ఆమెకు చదువు ఏరకం గానూ అబ్బదు. ఇది ఉపాధ్యాయుడిగా నా అభిప్రాయం''

"బాబూ! అవకాశం వస్తే ఆడపిల్ల జీవితాలతో ఆడుకుని, నాశనం చేసే వాళ్ళ గురించి పేపర్లో చూస్తున్నాం. టీ.వీ.ల్లో ఇంటన్నాం. అట్లాంటిది మీరు... మీరు మా కళ్ళు తెరిపించారు. మా బాధ్యత గుర్తుచేశారు. ఇంత చిన్నవయసులో వున్నా మీరు మా కళ్లకు దేవుడిలా కనిపిస్తున్నారు. ఇలాంటి తప్పుడు కూతుర్ని ఇక ఇంట్లో ఉంచుకోం!'' అంటున్న కామాక్షి తల్లి మాటలకు రాంబాబు అడ్డు తగిలాడు.

"తప్పమ్మా! మీరలా అనకూడదు. మీ కూతురు తప్పుడు కూతురు కాదు, తప్పటడుగు వేయబోయింది. తల్లిగా ఆమె జీవితం బాగుండాలని దీవించాలిగానీ ఆమె అలా ఉత్తరం రాసిందని పదిమందికీ తెలిసేలా మీ అమ్మాయిని కొట్టుకుని, తిట్టుకుంటే పరువు పోతుంది తప్ప సమస్య పరిష్కారం కాదు.

నాకు అందమయిన భార్య వుంది. మా ఇద్దరి మధ్య పొరపొచ్చాలులేని అనురాగం వుంది. ఆమె అందమైన నవ్వులో జీవితాంతం బ్రతికేయగలను నేను. మళ్లీ అంత అందమైన నవ్వు మీ అమ్మాయిలో చూశాను నేను. ముద్దబంతిలా నవ్వే ఆమె మనసును అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి. నా మాట మీద ఏ మాత్రం గౌరవం వున్నా మీరు కామాక్షిని ఏమీ అనవద్దు. ఏమైనా అంటే అవి నాకు తగులుతాయని గుర్తు పెట్టుకుంటే చాలు వస్తాను'' అని కామాక్షి తనకు రాసిన ప్రేమలేఖను వారిముందే ముక్కలు చేసి బయటకు నడవబోయాడు రాంబాబు.

ఆ సమయంలో లోపలినుండి రివ్వున వచ్చి అతని కాళ్లముందు వాలిపోయింది కామాక్షి.

"సార్! నన్ను... నన్ను క్షమించండి సార్! నేను మీ పట్ల చాలా తప్పుగా ప్రవర్తించాను. తండ్రిగా, మార్గదర్శిగా చూడాల్సిన మిమ్మల్ని అందరిలాంటివారే అనుకున్నాను గాని ఇలా నా తప్పు నేనే తెలుసుకునేలాచేసి నన్ను నన్నుగా క్షమిస్తారని ఊహించలేదు సార్! సార్! నన్ను క్షమించరూ!" పశ్చాత్తాపం కన్నీళ్లరూపంలో గంగై ప్రవహించినపుడు ఏ వ్యక్తి అయినా 'గంగ' అంత పవిత్రుడే!

ఆ గదిలో కామాక్షి తండ్రి, అన్నలిద్దరూ వున్నా ఒక్కరు కూడా కోపాన్ని ప్రదర్శించడం గాని, నోరు మెదపక పోవడంగానీ రాంబాబుకు ఆశ్చర్య మనిపించింది.

ఆ ఇంటి వాతావరణాన్ని ఆ విధంగా శాసించగలిగిన కామాక్షి తల్లికి మనసులో మరోమారు కృతజ్ఞతలు చెప్పుకుంటూ బయటక[illegible]ాడు రాంబాబు.

★★

నెల రోజుల [illegible]ాత - కామాక్షి వివాహానికి హాజరయ్యాడు రాంబాబు, చాతుర్యతో సహా!

కామాక్షి తల్[illegible]నదంపతులచేత రాంబాబు ద[illegible]ు నమస్కరింప చేసింది. అక్ష[illegible]ువేసి ఆశీర్వదిస్తూ రాంబాబు ఇలా అన్నాడు.

"అత్తవారింటికి అయానిక బంధమై, భర్త కష్టసుఖాలలో సమయోజనీయ బంధమై వచ్చే మూడేళ్లలో ఏక, ద్వి, త్రి బంధాలై నీ కాపురం కోటి వీణలరాగంతో సాగే పాటగా మారాలని కోరుకుంటున్నాను కామాక్షి!"

కన్నీటి కృతజ్ఞతాభివందనాలతో అభివాదం చేసింది కామాక్షి అరవిరిసిన ముద్దబంతి నవ్వుతో! ఆ నవ్వులో మూగ బాసలేమిటో రాంబాబుకే తెలుసు!!! ●

'స్వాతి సపరివారపత్రిక'
31-01-2003